నల్లగొండ కలెక్టరేట్ వద్ద దళితబంధు ప్రొసీడింగ్ కాపీలతో సోమవారం నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు, దళితబంధు సాధన కమిటీ నాయకులు

దళితబంధు యూనిట్లేవీ?

- తక్షణమే గ్రౌండింగ్ చేపట్టాలి
- నల్లగొండ కలెక్టరేట్ వద్ద ప్రొసీడింగ్ కాపీలతో లబ్ధిదారుల నిరసన

నల్లగొండ రూరల్, డిసెంబర్ 18: నల్లగొండ నియోజకవర్గంలో దళితబంధు పథకం యూనిట్లకు గ్రౌండింగ్ చేపట్టాలని దళితబంధు సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద దళితబంధు ప్రొసీడింగ్ కాపీలు పొందిన లబ్ధిదారులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళితబంధు పథకం రెండో విడుతలో నల్లగొండ నియోజకవర్గంలో 1,055 మందిని ఎంపిక చేశారని, వారు బ్యాంకు అకౌంట్లు సైతం ఓపెన్ చేశారని తెలిపారు. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవో, మున్సిపల్ వార్డుల్లో సభల ద్వారా అర్హులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సమాచారం ఇచ్చి కలెక్టర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న జిల్లా కేంద్రంలో ప్రొసీడింగ్ కాపీలు అందజేశారని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ఆ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, తమకు మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన కమిటీ నాయకులు పాలడుగు నాగార్జున, బకరం శ్రీనివాస్, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఒక్క రూపాయే!

- మరొకరికి రూ.62 మాత్రమే జమ
- మొబైల్‌లో మెసేజ్ చూసుకొని విస్తుపోతున్న రైతులు
- రాష్ట్రంలో గందరగోళంగా పెట్టుబడి సాయం పంపిణీ

రైతుబంధు సాయం కింద రూ.1 మాత్రమే బ్యాంక్ ఖాతాలో జమైనట్టు వచ్చిన సెల్ మెసేజ్‌ను చూపిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు చెందిన రైతు పాండురంగారెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): యాసంగి సీజన్ రైతుబంధు పంపిణీ గందరగోళంగా మారింది. ఇప్పటికే పలువురు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులు జమ కాగా, పలువురి ఖాతాల్లో రూ.1, రూ.62 చొప్పున జమ కావడంతో ఆయా రైతులు విస్తుపోయారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన పాండురంగారెడ్డికి ఐదు ఎకరాల భూమి ఉన్నది. ఎకరాకు రూ.ఐదు వేల చొప్పున రూ.25 వేలు జమ కావాల్సి ఉండగా.. ఈసారి ఒక్క రూపాయి మాత్రమే జమైనట్టు ఆయన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆయన కంగుతిన్నారు. ఇదే మండలంలోని టంకర గ్రామానికి చెందిన మరో రైతు ఆంజనేయులుకు రూ.62 జమైనట్టు మెసేజ్ వచ్చింది. ఆంజనేయులుకి గ్రామంలో రెండు గుంటల భూమి ఉండగా గతంలో రూ.250 పడేది. ఈసారి రూ.62 మాత్రమే పడింది. తనకు వేరే సర్వే నంబర్‌లో ఎకరంన్నర భూమి ఉన్నప్పటికీ ఆ పైసలు ఇంకా పడలేదని ఆంజనేయులు పేర్కొన్నారు. రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినప్పటికీ ఇంకా తమ ఖాతాల్లో జమ కాలేదని పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ధాన్యానికి ధర దక్కదాయె!

మొదటిపేజీ తరువాయి...

రకానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.3,301, కనిష్ఠంగా రూ.2,009 ధర పలికింది. ఆర్ఎన్ఆర్ రకానికి గరిష్ఠంగా రూ.3,159, కనిష్ఠంగా రూ.2,000, హెచ్‌ఎంటీ రకానికి గరిష్ఠంగా 3,259, కనిష్ఠంగా రూ.2,002 పలికింది. అయితే, గత శుక్రవారం కంటే తక్కువ ధర నిర్ణయించారంటూ రైతులు కోపోద్రిక్తులయ్యారు.

ఒకరిద్దరికే గరిష్ఠ ధర

రైతులు తీసుకొచ్చిన ఉత్పత్తులకు వ్యాపారులు ఈ-నామ్ ద్వారా టెండర్ వేస్తారు. దీనిని మార్కెట్ అధికారులు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఓపెన్ చేసి ధర నిర్ణయిస్తారు. సోమవారం మార్కెట్‌కు పరిమితికి మించి ధాన్యం రావడంతో మధ్యాహ్నం 2 గంటల తరువాత టెండర్ ఓపెన్ చేసి రైతులకు ధాన్యం ధరలను తెలియపరిచారు. వాటిని పరిశీలించిన రైతులు.. క్వింటాకు రూ.400 పైబడి ధర తగ్గించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్న కూలీలను అడ్డుకున్నారు. బస్తాల్లోకి ఎత్తిన ధాన్యాన్ని కింద పోసి నిరసన తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే వ్యాపారులు ధాన్యం ధరను తగ్గించారంటూ రైతులు మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆ

తరువాత మార్కెట్ ఎదుట వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులు, మార్కెట్ అధికారులతో మాట్లాడినా శాంతించలేదు. చివరకు ఎక్కువ ధర పలికిన ధాన్యాన్ని రైతులు ఈరోజు అమ్ముకోవచ్చని, తక్కువ ధర పలికిన ధాన్యానికి మళ్లీ టెండర్ వేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. మార్కెట్‌కు పరిమితికి మించి ధాన్యం విక్రయానికి రావడంతో పేరుకుపోయింది. దీంతో మార్కెట్‌లో స్థలం లేకపోవడంతో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నీలం సుహాసిని మార్కెట్‌కు ఒకరోజు సెలవు ప్రకటించారు.

మిర్చి రైతు బలవన్మరణం

- పంటకు నష్టం వాటిల్లడంతో పురుగు మందు తాగిన బిచ్యా

బయ్యారం, డిసెంబర్ 18: చేతి కొచ్చిన పంటకు నష్టం వాటిల్లిందన్న మనోవేదనతో పురుగు మందు తాగిన రైతు సోమవారం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రెడ్యాతండాకు చెందిన లూలావత్ బిచ్యా (48) మూడెకరాల్లో మిరప పంట సాగు చేశాడు. తెగులు రావడంతో పంట పూర్తిగా దెబ్బతిని రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. చేనులో బోరు మోటర్ కాలిపోవడంతో మరింత కుంగిపోయాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చేనుకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లిన బిచ్యా అక్కడే పురుగుల మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

'మేడిగడ్డ'పై తప్పించుకొంటే ఊరుకోం

- బరాజ్ పునరుద్ధరణ పనులు చేయాలని ఎల్‌అండ్‌టీకి మంత్రి ఉత్తమ్ హెచ్చరిక
- ఇరిగేషన్, ఇంజినీర్లతో చర్చించి పూర్తి నివేదికివ్వాలని ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు ఘటనపై తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని ఎల్‌అండ్ టీ ప్రతినిధులను రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను చేయాల్సిందేనని స్పష్టంచేశారు. ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించుకొని బరాజ్ కుంగుబాటుకు గల కారణాలను తేల్చి, నివేదికను అందించాలని ఎల్‌అండ్‌టీ ప్రతినిధులను ఆదేశించారు. కుంగుబాటుకు గురైన పిల్లర్ల పునరుద్ధరణ బాధ్యత తమదేనని, తమ సొంత నిధులతో పనులు చేస్తామని గతంలో ప్రకటించిన ఎల్‌అండ్‌టీ సంస్థ తాజాగా మాట మార్చిన నేపథ్యంలో మేడిగడ్డ బరాజ్ పనులు చేసిన ఎల్‌అండ్‌టీ గ్రూప్ డైరెక్టర్ ఎస్‌వీ దేశాయ్, ఏజెన్సీ ప్రతినిధులతో సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అంతపెద్ద ప్రాజెక్ట్ పనులను నాణ్యత లేకుండా చేశారని, ఏదో ఒక లెటర్ అధికారికి ఇచ్చి పునరుద్ధరణ పనులను తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజాధనాన్ని వృథాచేసి ప్రాజెక్టు కూలిపోవడానికి కారణమైన ఎవరినీ వదిలిపెట్టబోమని చెప్పారు. అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణ ఏజెన్సీలను కూడా పిలిచి మాట్లాడాలని సూచించారు. తప్పు చేసినవారు తప్పించుకోవాలని చూస్తే న్యాయపరంగా, చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మరోసారి సమావేశం

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు సంబంధించి మంగళవారం మరోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్ణయించినట్టు తెలిసింది.

6 గ్యారెంటీలకు 28 నుంచి దరఖాస్తులు

- గ్రామ సభల్లోనే స్వీకరణ, ఎంపిక
- పథకాల అమలు తేదీని అసెంబ్లీలో ప్రకటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- సంక్రాంతి తర్వాత ఎంపీ టికెట్లు
- మెదక్ బరిలో సోనియాకు ఆహ్వానం
- కొత్తగా హౌసింగ్ శాఖ ఏర్పాటు
- పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయాలు వెల్లడించిన పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ
- హాజరైన ఠాక్రే, సీఎం, మంత్రులు

సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ నేత మాణిక్‌రావ్ ఠాక్రే, మంత్రులు

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ఆ పార్టీ కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపింది. పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నది. గ్రామసభల ద్వారానే దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించింది. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ)లో తీసుకున్న నిర్ణయాలను పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆరు గ్యారెంటీల అమలు, పార్లమెంట్ ఎన్నికలు, టికెట్ల కేటాయింపు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, అసెంబ్లీలో వ్యవహరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు.

అతి త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

నామినేటెడ్ పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టు షబ్బీర్ అలీ తెలిపారు. గతంలో ఎవరెవరికి హామీ ఇచ్చామో, ఎవరెవరికి ఇవ్వాల్సి ఉంటుందో జాబితా సిద్ధం చేయాలని సీఎం సూచించారని వెల్లడించారు. పదేండ్లపాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు అధికారానికి దూరంగా ఉన్నారని, ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారని, పోస్టుల భర్తీ ఆలస్యం చేయడం మంచిది కాదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్టు సమాచారం. నెల రోజుల్లోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

సంక్రాంతి తర్వాత అభ్యర్థుల ప్రకటన

లోక్‌సభకు పోటీ చేసే పార్టీ అభ్యర్థులను సంక్రాంతి తరువాత ప్రకటిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సమాచారం. అసెంబ్లీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించామని, ఎంపీ అభ్యర్థుల విషయంలో ఆలా చేయబోమని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్ల కేటాయింపు వ్యవహారం అధిష్ఠానం చూసుకుంటుందని, తన పాత్ర ఏమీ ఉండదని చెప్పినట్టు సమాచారం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులకు ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్లు దక్కే అవకాశం లేదని, ఈ మేరకు అధిష్ఠానం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నదని అన్నట్టు తెలిసింది.

మెదక్ బరిలో సోనియాగాంధీ!

మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్టీ అగ్రనేత సోనియాగాంధీని పోటీ చేయాలని ఆహ్వానిస్తూ పీఏసీలో ఏకగ్రీవ తీర్మానం చేసిట్టు షబ్బీర్ అలీ తెలిపారు. ఈ మేరకు సోనియాగాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు లేఖ రాయనున్నట్టు తెలిపారు. గతంలో ఈ స్థానం నుంచి ఇందిరాగాంధీ పోటీ చేసి గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు.

ఆ శాఖలపై అసెంబ్లీలో చర్చ.. శ్వేతపత్రం విడుదల

ఆర్థిక, నీటిపారుదల, విద్యుత్తు శాఖ, మిషన్ భగీరథపై అసెంబ్లీలో చర్చించడంతో పాటు శ్వేతపత్రం విడుదల చేస్తామని షబ్బీర్ అలీ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖలో జరిగిన అవకతవకలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏసీ మీటింగ్‌లో వివరించారని చెప్పారు. కాళేశ్వరం కోసం రూ.85-90 వేల కోట్లు ఖర్చు చేసి 90 వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదని ఉత్తమ్ చెప్పారని పేర్కొన్నారు. వీటిపై శ్వేత పత్రం విడుదల చేసి ప్రజల్లో చర్చ పెడుతామని తెలిపారు.

దరఖాస్తులు, ఎంపిక గ్రామసభల ద్వారానే..

కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకారం ఆరు గ్యారెంటీల అమలులో గ్రామసభలు అత్యంత కీలకం కానున్నాయి. దరఖాస్తుల స్వీకరణతో పాటు లబ్ధిదారుల ఎంపిక కూడా గ్రామసభల ద్వారానే చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇటు పార్టీ తరుపున, అటు ప్రభుత్వం తరుపున ప్రతినిధులను నియమించి గ్రామసభలను నిర్వహించనున్నారు. గ్రామసభ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, అందరి ఆమోదం తెలిపిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. దీని పర్యవేక్షణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించనున్నారు. అయితే, పథకాల అమలులో తమ కార్యకర్తలకే తొలి ప్రాధాన్యం ఉంటుందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే చెప్పారని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. తమ కార్యకర్తల భార్యకు, బామ్మర్దికి, తమ్ముళ్లకు, ఇంటోళ్ల పేర్లు పెట్టి అడ్డగోలుగా తీసుకుంటామంటే నడవదని, నిజమైన అర్హులకే ఇస్తామని తెలిపారు. కొత్త హౌసింగ్ శాఖను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

పథకాల అమలు ఎప్పటి నుంచి?

ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 28 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తామంటూ షబ్బీర్ అలీ చేసిన కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి సంబంధించినది. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన ప్రకటన రావాల్సిన అవసరం ఉంటుంది. పెన్షన్ పెంపు, మహిళలకు రూ. 2500, రూ. 500కే గ్యాస్, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, కొత్త రేషన్‌కార్డుల జారీ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్న షబ్బీర్‌అలీ.. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు వంటి పథకాలపై ఎటువంటి ప్రకటన చేయలేదు.

పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు

సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రెండేసి నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించగా మిగిలిన వారికి ఒక్కో నియోజకవర్గ బాధ్యతను అప్పగించారు.

ఇన్‌చార్జీలు వీరే

చేవెళ్ల, మహబూబ్‌నగర్-రేవంత్‌రెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్-భట్టి విక్రమార్క, నాగర్‌కర్నూల్-జూపల్లి కృష్ణారావు, నల్లగొండ-ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి-కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్-కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం-పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్-సీతక్క, పెద్దపల్లి-శ్రీధర్‌బాబు, కరీంనగర్-పొన్నం ప్రభాకర్, నిజామాబాద్-జీవన్‌రెడ్డి, జహీరాబాద్-పీ సుదర్శన్‌రెడ్డి, మెదక్-దామోదర రాజనర్సింహ, మల్కాజిగిరి-తుమ్మల నాగేశ్వరరావు.

వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సాగునీటి కోసం రైతుల ధర్నా

పెబ్బేరు, డిసెంబర్ 18: జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోని పంటలకు నీరందించాలని వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రైతులు సోమవారం స్థానిక ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారికి బీఆర్ఎస్ నాయకులు మద్దతిచ్చారు. డీ-19 కాల్వ కింద పెంచికలపాడు, జనుంపల్లి, మునగమాన్‌దిన్నె, సూగూరు, కొత్తసూగూరు, పలు గ్రామాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల్లో మిరప, ఇతర పంటలను సాగు చేసినట్టు రైతులు తెలిపారు. పంట చేతికొస్తున్న దశలో జూరాల అధికారులు వారం రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారని మండిపడ్డారు. వారి బంది ప్రకారం ఫిబ్రవరి 15 వరకు జూరాల నీరు విడుదల చేయాల్సి ఉందని గుర్తుచేశారు. ఎస్ఈ సత్యశీలారెడ్డికి వినతిపత్రం అందజేయగా.. నీటిని విడుదల కు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'శ్రీరాజరాజేశ్వర' బాధితులను ఆదుకోవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖ

కరీంనగర్, డిసెంబర్ 18 (నమస్తేతెలంగాణ): సిరిసిల్ల జిల్లా పరిధిలోని శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో ముంపునకు గురైన బాధితులను తక్షణమే ఆదుకోవాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నో ఏండ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ఎస్సారార్ (మిడ్ మానేరు) రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈ లేఖ ద్వారా సీఎం దృష్టికి తెస్తున్నానని పేర్కొన్నారు. ప్రాజెక్టు ముంపు పరిధిలోని 12 గ్రామాల ప్రజలు ఇండ్లు, భూములు త్యాగం చేశారని తెలిపారు.

30న రవీంద్రభారతిలో నిర్వహించే ఆటా సేవా కార్యక్రమాల గ్రాండ్ ఫినాలేకు ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆహ్వానిస్తున్న వేడుకల చైర్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ప్రతినిధులు

దొంగ రాత్రి సీమ లిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి...

కొనసాగిస్తున్నది. కేంద్ర జల్‌శక్తిశాఖ ఆదేశాలను, ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి ప్రాజెక్టు పనులను అర్ధరాత్రి వేళ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నది. ఇప్పటికే ఇదే విషయమై తెలంగాణ అనేకమార్లు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ కేఆర్ఎంబీ నుంచి ఎలాంటి స్పందన లేకుండాపోయింది.

ఎన్జీటీ ఉత్తర్వులు ఉల్లంఘించి..

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాత కొత్త ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల, 80వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం పోతిరెడ్డి విస్తరణ పనులకు రూ.6,829.15 కోట్లతో 2020 మే 2దో తేదీన 203 జీవోను ఏపీ సర్కారు జారీ చేసింది. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లేలా.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేపడుతున్న ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా పెన్నా బేసిన్‌కు కృష్ణాజలాలను తరలించనున్నారు. అదేరీతిన 15.07.2020న పెన్నా బేసిన్‌లో కాల్వల సామర్థ్య పెంపు పనులకు రూ.1415 కోట్లతో చేపట్టేందుకు జీవో 388 ద్వారా పాలనా అనుమతులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో కృష్ణాబోర్డు, కేంద్రానికి అనేక సార్లు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ముందుకుపోవద్దని గతంలోనే కేంద్ర జల్‌శక్తి అదేశానుసారం కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏపీకి ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కేంద్ర ఆదేశాలను బేఖాతరు చేసి ఏపీ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కేంద్ర జల్‌శక్తి, పర్యావరణ అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను చేపడుతున్నదని తెలంగాణకు చెందిన ఒకరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన ఎన్జీటీ ఒక ఉమ్మడి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రాజెక్టుకు అనుమతులున్నాయా? లేవా? ప్రాజెక్టు వల్ల ఏపీ, తెలంగాణకు సమన్యాయం జరుగుతుందా? లేదా? శ్రీశైలం జలాలు ఇరు రాష్ట్రాలకు చెందిన అంశమైనందున కేంద్ర జల్‌శక్తి, పర్యావరణ అనుమతులతోపాటు మరేవిధమైన అనుమతులు కావాల్సి ఉంటుందనే అంశాలను కూడా తేల్చి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఆ కమిటీ నివేదిక వచ్చేవరకూ ప్రాజెక్టు పనులను చేపట్టవద్దని, ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు కావాల్సిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవచ్చని ఎన్జీటీ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దానిని సాకుగా చేసుకొని ఏపీ ప్రభుత్వం ఏకంగా టెండర్లను ఖరారు చేయడంతోపాటు భారీ యంత్రాలు, వేలాదిమంది కార్మికులతో యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులనే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఏపీ సర్కారు ఉద్దేశపూర్వకంగా ఎన్జీటీ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నదని, దానిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈసారి తెలంగాణ ప్రభుత్వం ఎన్జీటీని ఆశ్రయించింది. అందులో కేంద్ర అటవీ పర్యావరణశాఖ కార్యదర్శి, కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శులతోపాటు ఎస్‌పీఎంఎల్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఎండీలను ప్రతివాదులుగా చేర్చింది. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను స్వయంగా ఎన్జీటీ బృందమే సందర్శించాలని ప్రత్యేకంగా తెలంగాణ సర్కారు అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో వాస్తవాలను తేల్చేందుకు ఎన్జీటీ కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయగా, పనుల విషయంలో ఏపీ ప్రభుత్వం చెబుతున్న విషయాలన్నీ అబద్ధమేనని ఆ కమిటీ నివేదించింది. దీంతో పర్యావరణ అనుమతులు పొందేవరకూ రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీకోసం కూడా ఎలాంటి తవ్వకాలను, పనులను చేపట్టవద్దని ఎన్జీటీ నొక్కిచెబుతూ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడితే అందుకు ఏపీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి 2021 డిసెంబర్‌లో ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే కొద్దిరోజులపాటు స్తబ్ధుగా ఉన్న ఏపీ సర్కారు తెలంగాణ ఎన్నికల్లో నిమగ్నమైన సమయాన్ని అదునుగా తీసుకుని కొద్ది రోజుల నుంచి ప్రాజెక్టు పనులను మళ్లీ ముమ్మరం చేసింది. ఎన్జీటీ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరీ పనులు చేస్తున్నది.

అర్ధరాతి వేళ జోరుగా లైనింగ్ పనులు..

ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకోసమంటూ ఏకంగా ప్రాజెక్టు పనులనే గతంలో చాలా వరకు పూర్తి చేసింది. కేంద్ర జల్‌శక్తి మార్గదర్శకాల (2010) ప్రకారం డీపీఆర్ తయారీ కోసం చేపట్టాల్సిన పనులకన్నా ఎన్నో రెట్ల స్థాయిలో పనులు జరిగాయని ఎన్జీటీ నియమించిన కమిటీనే స్వయంగా ఫొటోలతో సహా గతంలోనే నివేదించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీశైలం రిజర్వాయర్ 800 ఫీట్ల నుంచి 8.8 కిలోమీటర్ల అప్రోచ్ చానల్‌ను తవ్వాల్సి ఉండగా, నివేదిక సమర్పించేనాటికే ఆ పనులన్నీ పూర్తయ్యాయి. ఫోర్‌బే ప్రాంతానికి, అప్రోచ్ చానల్‌కు మధ్య కేవలం 15 మీటర్ల తవ్వకం పనులు మాత్రమే మిగిలి ఉందని తెలిపింది. అదేవిధంగా అప్రోచ్‌చానల్ ఫోర్‌బే